క్లుప్తంగా

బదిలీలు సహజం



ఉద్యోగులను సన్మానించిన ఆలయ ఈవో స్నేహలత, ట్రస్టీ శిరోలీ, ఉద్యోగ సిబ్బంది

కడ్తాల్: ఉద్యోగ నిర్వాహణలో బదిలీలు సహజమని, అంకితభావంతో పనిచేసేవారిని ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని మైసిగండి ఆలయ ఈవో స్నేహలత, ఆలయ ట్రస్టీ శిరోలీ పేర్కొన్నారు. మైసిగండి ఆలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బోడ్యానాయక్ అమీర్‌పేట్ కనకదుర్గా ఆలయానికి, పాలకుర్ల మల్లేశ్‌గౌడ్ జూబ్లీహిల్స్ పెద్దమ్మ దేవాలయానికి, దేవేందర్ రాయికల్ రామలింగేశ్వరస్వామి ఆలయానికి, రమాదేవి కర్మన్‌ఘాట్ ఆంజనేయ స్వామి దేవాలయానికి బదిలీ అయ్యారు. బుధవారం ఆలయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని ఘనంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధికి వారు అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీ భాస్కర్, ప్రధాన అర్చకులు యాదగిరిస్వామి, ఉద్యోగులు కృష్ణగౌడ్, చంద్రయ్య, రాములు, శ్రీనివాస్, విజయ్‌కుమార్, శ్రవణ్‌కుమార్, శ్రీనివాసులు, మహేశ్, పత్యానాయక్, హర్షవర్ధన్, వెంకటేశ్, ఆనంద్, సంతోష్, భానుప్రకాశ్, రవీందర్, కృష్ణయ్య, బాలబ్రహ్మ చారి, శ్రీను తదితరులు పేర్కొన్నారు.

పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా పరమేశ్



నియామకపత్రం అందజేస్తున్న గోవర్ధన్

ఇబ్రహీంపట్నం: పీఆర్టీయూ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడిగా వరకాల పరమేష్‌ను నియమించారు. బుధవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె గోవర్ధన్‌యాదవ్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ నాలుగోసారి మండల అధ్యక్షుడిగా నియమించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. 22 సంవత్సరాలుగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వాటి పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవినిచ్చిన వారి ఆశలు వమ్ము చేయకుండా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తానని తెలిపారు.

సమ్మె నోటీస్ అందజేత

తలకొండపల్లి: సమస్యల పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు గురువారం మండల కేంద్రంలో ఒక్క రోజు సమ్మె నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సంజీవరెడ్డికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యవసర సేవలైన విద్యుత్, మంచి నీరు, సఫాయి బంద్ పేరిట గతంలో సమ్మె చేసినా ప్రభుత్వం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం నేడు 48 గంటల పాటు నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జంగయ్య, రాములు, ఏరియా కన్వీనర్ పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

యాచారం: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నుంచి పంచాయతీ ఉద్యోగులు సమ్మె చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం యాచారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డికి పంచాయతీ కార్మికులు నోటీసు ఇచ్చారు. పంచాయతీ ఉద్యోగులకు పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఎంపీడీఓను కోరారు.

టీయూడబ్ల్యూజే మాడ్గుల అధ్యక్షుడిగా యాదగిరి

మాడ్గుల: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ టీయూడబ్ల్యూజే–ఐజేయూ మండల అధ్యక్షుడిగా నవతెలంగాణ విలేకరి చాట్ల యాదగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు చంద జంగయ్య గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో యూనియన్ మండల శాఖ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నరసింహ, హఫీజ్, జంగయ్య, నరసింహ్మ గౌడ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

ఇబ్రహీంపట్నం: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితుల కోసం సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ఇబ్రహీంపట్నంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గసభ్యులు సామేల్, యాదయ్యలు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో తుఫాన్ వరదలు రావడంతో కొండ చరియలు విరిగిపడి జనజీవనం అతులాకుతలం అయ్యిందన్నారు. మానవత్వంతో ఆ ప్రాంత ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఎల్లేశ్, శ్యాంసుందర్, జంగయ్య, యాదగిరి, శంకర్, నరసింహ, వీరేశం, రాములు పాల్గొన్నారు.

కలగానే నూతన వంతెన

శిథిలావస్థకు చేరిన పాత కల్వర్టు
- నల్లా చెరువు నిండితే రాకపోకలకు అంతరాయం
- ఇబ్బందుల్లో స్థానికులు, తండావాసులు
- పట్టించుకోని అధికారులు



శిథిలావస్థకు చేరిన వంతెన

తలకొండపల్లి: నల్లా చెరువు సమీపంలోని బ్రిడ్జి శిథిలావస్థకు చేరినా, పగుళ్లు వచ్చినా పట్టించుకునే వారు కరువయ్యారు. 50 ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జికి నేటి వరకూ కూడా మరమ్మతు పనులు చేపట్టడం లేదు. ఇది శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉంది. కట్టిన రాళ్లు ఊడి పూర్తిగా ధ్వంసమైంది. సైడ్ గోడలు నెర్రలు బారాయి. అక్కడక్కడ కొన్ని ప్రదేశాలలో గోడలు కూలాయి. ఐనప్పటికీ ఆ వైపుగా చూసిన అధికారులే కరువయ్యారు. సమీపంలోని నల్లా చెరువు నిండితే బ్రిడ్జిపై నుంచి నీటి ప్రవాహం ఉంటుంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదు. కనీసం ఈ ప్రభుత్వం అయినా పట్టించుకుంటుందని స్థానికులు ఆశిస్తున్నారు. పాత కల్వర్టు స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

వర్షపు నీరు ఇలా..

వర్షపు నీరు లక్ష్మి తండా, బుద్యా తండాల మీదుగా ప్రవహిస్తూ మోదుగు కుంటకు చేరుతుంది. సుమారు 3 కిలో మీటర్ల మేర ప్రవహించి చంద్రధన ఫీడర్ చానల్, మోదుగు కుంట నుంచి కల్వర్టుల్లోకి చేరుతుంది. చెరువు నిండినప్పుడల్లా బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. గత రెండేళ్ల క్రితం చెరువు నిండి అలుగు పారింది. ఫలితంగా బ్రిడ్జి మీదుగా నీరు ప్రవహించి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు.

బ్రిడ్జి పరిధిని పెంచాలి..

పాత కల్వర్టు స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. అంతేగాకా డబల్ రోడ్డుకు అనుగుణంగా నీటి ప్రవహం పోయేందుకు బ్రిడ్జి పరిధిని పెంచాలి. ఈ ప్రాంతం నుంచి డబుల్ రోడ్డు నిర్మించి 12 ఏళ్లు గడిచినా నేటి వరకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.



నల్లా చెరువు నిండడంతో బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న నీరు (ఫైల్)

మరమ్మతులు చేయలేదు



50 ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టుకు ఇప్పటి వరకూ ఎలాంటి మరమ్మతు పనులు చేపట్టలేదు. ఫలితంగా రాళ్లు ఊడిపోయి, కల్వర్టు శిథిలావస్థకు చేరి కూలిపోనుంది. ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు స్పందించి అవసరమైన నిధులు మంజూరు చేయించాలి. వెంటనే నూతన బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలి.

– బక్కి కుమార్, మాజీ సర్పంచ్, చంద్రధన

బ్రిడ్జి పరిధిని పెంచాలి



శిథిలమైన కల్వర్టుతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేగంగా నీరు ప్రవహించడానికి బ్రిడ్జి ఎత్తుతో పాటు పరిధిని పెంచి నూతన నిర్మాణం చేపట్టాలి. సమీపంలోని నల్లా చెరువు నిండి అలుగు పారితే ఈ కల్వర్టు మీదుగా నీటి ప్రవహం ఉంటుంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది.

– రాజు యాదవ్, రైతు, చంద్రధన

శిథిలావస్థకు చేరుకుంది



నల్లా చెరువు సమీపంలోని కల్వర్టు పూర్తిగా ధ్వంసమై శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రాణాలు అర చేత పట్టుకొని వాహన దారులు ప్రయాణిస్తున్నారు. ప్రమాదం జరుగకముందే నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

– భాను నాయక్, రైతు, పూల్‌సింగ్ తండా

‘పాలమూరు–రంగారెడ్డి’ నిధులు మళ్లించొద్దు

మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



మాట్లాడుతున్న జైపాల్‌యాదవ్ తదితరులు

తలకొండపల్లి: పాలమూర్–రంగారెడ్డి ఎత్తిపోతల పథక నిధులను నారాయణ్‌పేట్–కొడంగల్ పథకానికి మళ్లించొద్దని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం తలకొండపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వట్టెం, ఉదండాపూర్ రిజ్వారాయర్ల నుంచి హైలెవల్ కెనాల్స్ నిర్మించి కల్వకుర్తి నియోజక వర్గంలోని తలకొండపల్లి, కడ్తాల్, మాడ్గుల్, ఆమనగల్లు మండలాలకు సాగు నీటిని అందించాలన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కల్వకుర్తి నియోజకవర్గానికి సాగు నీరు అందించి పాలమూర్–రంగారెడ్డి ఎత్తి పోతల పథకానికి కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి పేరు పెడితే ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, రొయ్యల యాదయ్య, శ్రీధర్‌రెడ్డి, శ్రీశైలం, పాండు, శేఖర్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ఆమనగల్లు: సమాజంలో విధులు నిర్వహిస్తున్న న్యాయవాదులపై పోలీసులు దాడులకు పాల్పడడం దారుణమని ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపల్లి జగన్ పేర్కొన్నారు. జనగామ జిల్లాలో న్యాయవాది అమృతరావ్, కవిత దంపతులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా వారిపై దాడిచేసి కొట్టడాన్ని నిరసిస్తూ ఆమనగల్లు పట్టణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు విధులను బహిష్కరించి అంబేడ్కర్ విగ్రహం వద్ద దీక్ష చేశారు. దాడులకు పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి ఆంజనేయులు, సీనియర్ న్యాయవాది యాదీలాల్, సభ్యులు రామకృష్ణ, పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో చంద్రధన ఉన్నత పాఠశాల 2010–11 (ఎస్ఎస్‌సీ బ్యాచ్)

కడ్తాల్: మైసిగండి గ్రామ సమీపంలోని ఓ రిసార్ట్‌లో చంద్రధన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2010–11 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఒకే పాఠశాలలో చదువుకున్న 40 మంది 13 సంవత్సరాల తర్వాత ఒక చోట కలుసుకున్నారు. ఎక్కడెక్కడో స్థిర పడిన వారంతా ఒక చోట చేరి తమ అనుభవాలను, చిన్న నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. రానున్న రోజుల్లో తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తామని తీర్మాణించారు. ఈ కార్యక్రమంలో విజయ్, హరీశ్, వెంకటేశ్‌గౌడ్, విక్రమ్, వెంకటేశ్, గిరి, శ్వేత, మౌనిక, సరస్వతి, మాధవి, శ్రీలత, లావణ్య, భాగ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపన్యాస పోటీలు



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీడీఓ కుసుమమాధురి

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జ్ఞానవాహిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. 6, 7తరగతుల విద్యార్థులకు ‘అమ్మ, నాన్నలతో నా అనుబంధం’, 8, 9, 10తరగతుల విద్యార్థులకు ‘నా జీవితంలో గురువు ప్రాధాన్యత’ అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు ఎంపీడీఓ కుసుమమాధురి నగదు బహుమతులు, షీల్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జ్ఞానవాహిని ఫౌండేషన్ అధ్యక్షుడు జూలూరి రవింద్రానంద్, గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోశాధికారి సత్యం, ఫౌండేషన్ ఫౌండర్ రంగారావ్, సభ్యులు డాక్టర్ శ్రీనివాస్, బికుమాండ్ల నర్సింహా, కొర్వి వెంకటయ్య, రాజు, సురేశ్, సాయిబాబా, కోట రామకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలని వినతి

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ ఎన్నికల ముందు చేవెళ్లలో నిర్వహించిన సభలో ఇచ్చిన ఎస్సీ డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఎస్సీ మోర్చా నేతలు ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీతకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంబేడ్కర్ అభయ హస్తం కింద ప్రతి కుటుంబానికి రూ. 12లక్షల ఆర్థిక సహాయం, మాల, మాదిగ కార్పొరేషన్లకు సంవత్సరానికి రూ.750 కోట్ల కేటాయింపు, ప్రతి ఎస్సీ కుటుంబానికి శాశ్వత ఇల్లు నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం, ఎస్సీ హాస్టల్స్ పునఃనిర్మాణానికి నిధుల కేటాయింపు, యువతకు సబ్సిడీపై రుణాల కేటాయింపు వంటి హామీలను అమలు చేయాలని కోరారు.



సునీతకు వినతిపత్రం ఇస్తున్న ఎస్సీ మోర్చా

సమస్యలు పరిష్కరించండి



తలకొండపల్లి: సభ్యత్వ నమోదులో ఉపాధ్యాయులు



కడ్తాల్: సభ్యత్వ నమోదులో పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు

పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

కడ్తాల్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా పీఆర్‌టీయూ టీఎస్ ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మక్తమాదారం, రావిచేడ్, ముద్వీన్ తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఉపాధ్యాయుల నుద్దేశించి సామల మహేందర్‌రెడ్డి మాట్లాడారు. త్వరలో ఏకీకృత సర్వీస్ సాధిస్తామని, ఉపాధ్యాయులకు ఎంఈఓలుగా, జేఎల్, డైట్ లెక్చరర్లుగా ప్రమోషన్‌లు ఇప్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పెండింగ్ డీఏలను, 50% ఫిట్‌మెంట్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జీఓ 11, 12లను సవరించి ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు తక్షణమే 5,500ల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పోస్టులను ఏర్పాటు చేసి, ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పద్మావతి, నరోత్తమ్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్ రావు, హెచ్‌ఎం జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ ఫిట్మెంట్ 50 శాతాన్ని ప్రకటించాలి: గోవర్ధన్

తలకొండపల్లి: పీఆర్‌సీ ఫిట్మెంట్ 50 శాతాన్ని వెంటనే ప్రకటించాలని జిల్లా అధ్యక్షుడు కస్య గారి గోవర్ధన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లోని ఐదు డీఏలను తక్షణమే మంజూరు చేయాలని ఆయన పేర్కొన్నారు. చుక్కాపూర్, ఖానాపూర్, తలకొండపల్లి, వెల్జాల్, పడకల్, గట్టు ఇప్పలపల్లి చంద్రధన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం గోవర్ధన్‌తో పాటు మండల శాఖ ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసురెడ్డిల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు ప్రారంభించారు. సుమారుగా 70 మంది ఉపాధ్యాయులను సభ్యత్వ నమోదు చేయించినట్లు వారు చెప్పారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు కస్య గారి గోవర్ధన్ మాట్లాడారు. డీఎస్సీ ఉపాధ్యాయులకు అపాయింట్మెంట్ ఇస్తున్న సందర్భంగా జిల్లాలో ఉపాధ్యాయుల రేషనలైజేషన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, శ్రీనివాసురెడ్డి, సరూర్‌నగర్ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మహేశ్వరం మండల బాధ్యులు జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ‘స్వచ్ఛదనం–పచ్చదనం’

ఇబ్రహీంపట్నం రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదిబట్ల మున్సిపాలిటీ కౌన్సిలర్ నారని మౌనిక సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగళ్‌పల్లి వార్డులో స్వచ్ఛదనం పచ్చదనంపై అవగహన కల్పిస్తూ వార్డుల్లో ర్యాలీగా పర్యటించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి కౌన్సిలర్ నారని మౌనిక సుధాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షకాలం సీజన్‌లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి: ఎంపీడీఓ వెంకటమ్మ

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ వెంకటమ్మ పేర్కొన్నారు. పోల్కంపల్లి, నాగన్‌పల్లి గ్రామాల్లో పర్యటించారు. మొక్కలు నాటడం కోసం ఏర్పాటు చేస్తున్న గుంతలను పరిశీలించారు. ఏపీఓ తిరుపతిచారి, పంచాయతీ కార్యదర్శులు సంపత్, రాధ పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మొక్కలు నాటి సంరక్షించాలని, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం–పచ్చదనంలో భాగంగా మైసిగండి గ్రామంలో అధికారులు, నాయకులు మొక్కలు నాటారు. మాజీ ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, ఏఓ శ్రీలత, ఏపీఓ అనిత, వసతిగృహ సంక్షేమాధికారి బాలరాజు, హీరాసింగ్, తులసీరాం, సీతారాం, తదితరులు పాల్గొన్నారు.



యాచారం: గడ్డమల్లయ్యగూడలో డీఎల్‌పీఓ సాధన తదితరులు

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: స్వచ్ఛదనం–పచ్చదనంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ శ్రీకాంత్ అన్నారు. తుమ్మలకుంట తండా, జంగారెడ్డిపల్లి గ్రామాల్లో ఆయన మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతను అందరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఎంపీఓ రఘు, ఏపీఓ కృష్ణ, ఈసీ కృష్ణ, ఎఫ్ఏ సాల్వయ్య, పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: పుర పరిధిలోని అన్ని వార్డులలో స్వచ్ఛతకు ప్రజలు కలిసి రావాలని చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి తెలిపారు. ఆమె పలు వార్డుల్లో పర్యటించి పనులను పరిశీలించారు. కొహెడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత ధన్‌రాజ్ గౌడ్, మేనేజర్ శ్రీధర్ రెడ్డి, డీఈ సత్యనారాయణ, పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: ఆయా గ్రామాల్లో అధికారులు డ్రైనేజీ కాల్వలను శుభ్రం చేయించారు. రోడ్లపై ఉన్న చెత్త, చెదారాన్ని తొలగించారు. గునుగల్ గ్రామంలో జరిగిన స్వచ్ఛదనం–పచ్చదనంలో డివిజన్ పంచాయతీ అధికారి సాధన మాట్లాడారు. ఎంపీడీఓ నరేందర్‌రెడ్డితో పాటు మండల పంచాయతీ అధికారి శ్రీలత పాల్గొన్నారు.



కడ్తాల్: మొక్క నాటుతున్న శ్రీనివాస్‌గౌడ్



తుర్కయంజాల్: కొహెడ పాఠశాలలో చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ



తలకొండపల్లి: తుమ్మలకుంట తండాలో అవగాహన ర్యాలీ



ఇబ్రహీంపట్నం రూరల్: పోల్కంపల్లిలో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటమ్మ

ఆర్థిక సాయం అందజేత

కడ్తాల్: సాలార్‌పూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సాయిలు కుమారుడు గణేశ్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని బుధవారం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ రూ.10 వేలు, మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ ట్రస్ట్ నుంచి రూ.5 వేలు, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ నుంచి సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా రూ.5 వేలు, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి రూ.5 వేలు, మాజీ ఎంపీటీసీ ప్రియా రమేశ్ రూ.3 వేలు సాయం అందించారు. అనంతరం జంగమ్మ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. అదే విధంగా చరికొండ గ్రామానికి చెందిన సత్తయ్య కుటుంబానికి రూ.5 వేలు, చంద్రమ్మ కుటుంబాన్ని రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. శ్రీనివాస్‌రెడ్డి, వీరయ్య, కడారి రామకృష్ణ, నర్సింహగౌడ్, పంతు నాయక్, సాయిలు, లాయక్‌అలీ, ఉన్నారు.

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్‌కు చెందిన కానుగుల జంగమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. బుధవారం మాజీ సర్పంచ్ శ్రీశైలం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసురెడ్డిలు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ప్రభాకర్‌రెడ్డి రూ. 3వేలు, శ్రీనివాసురెడ్డి రూ. 5వేలు సాయం చేశారు. మాజీ ఎంపీటీసీ రమేష్, నర్సింహ, శ్రీను, బిక్షపతి, రామస్వామి, అంజయ్య, కృష్ణయ్య, సత్యనారాయణ, మల్లేష్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.